# తొలి అక్షరం

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 01 సంచిక - 324 పేజీలు - 6 సోమవారం 14 అక్టోబర్ 2024


## నేడు దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం



తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13: ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకుని హిందూ మహాసముద్రం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయవ్య దిశగా కదిలి నేడు మరింత విస్తరించింది.దీని ప్రభావంతో రేపు (అక్టోబరు 14) దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. ఇది క్రమేపీ పశ్చిమ వాయవ్య దిశగా ఏపీ దక్షిణ కోస్తా తీరం వైపు పయనించే అవకాశాలున్నాయని ఐఎండీ పేర్కొంది. దీని ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా, ఏపీ దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వివరించింది.




## తెలంగాణ సాధనకు 'అలయ్ బలయ్' స్ఫూర్తి

- అంతరించిపోతున్న సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలి
- 'అలయ్ బలయ్' నిర్వహణ అభినందనీయం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13:తెలంగాణ సాధించుకోవడానికి 'అలయ్ బలయ్' స్ఫూర్తిగా పని చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సంస్కృతిని నలుదిశలా వ్యాపింపచేయడమే ముఖ్య ఉద్దేశంగా, - రాజకీయాలతో సంబంధం లేకుండా 'అలయ్ బలయ్' నిర్వహించడం అభినందనీయమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను కొనియాడారు. తెలంగాణ సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యతగా పేర్కొన్న ముఖ్యమంత్రి ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు, కమ్యూనిస్టుల నుంచి కాంగ్రెస్ కూడా తెలంగాణ కోసం ఉద్యమించాయని గుర్తు చేసుకున్నారు.హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి రేవంత్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్, మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్, రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిషన్‌రావ్ బాగ్డే, రాజస్థాన్ గవర్నర్ హరిబాబు పగాడే, మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయ శంకర్, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, తదితరులు కూడా అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివరాలు 2లో




## రైతు 'బందే'నా !

- పంటల సాగులో పెట్టుబడి భరోసా ఇంకెప్పుడు
- ఖరీఫ్ కరిగిపోయింది..రబీకైన ఖజానా కరుణిస్తుందా
- ఆశలన్ని ప్రభుత్వంపైనే...

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13: రాష్ట్రంలో రైతుబంధు పథకం బందయిపోయింది. రైతుభరోసాకోసం వ్యవసాయ రంగంలో కొత్తరాగాలు వినిపిస్తున్నాయి. అసలే కొత్త ప్రభుత్వం ..పదేళ్ళ విరామం తర్వాత కాంగ్రెస్‌కి తెలంగాణలో తొలి ముఖ్యమంత్రిగా అధికార బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కూడా ముఖ్యమంత్రిగా పాలనలో ఇదే తొలిఅ నుభవం.. గత బిఆర్ఎస్ పాలనలో ఏడు లక్షల కోట్ల రూపా యల అప్పుల ఊబిలో కూరుకుపోయివున్న రాష్ట్రం.. ఒక వైపు ప్రభుత్వ ఖజానాకు ఆర్థిక ఇబ్బందులు ..మరో వైపు పంట రుణాల మాఫీకోసం వత్తిళ్ల ..ఇన్నేసి ఇబ్బందుల్లోనూ రేవంత్ రెడ్డి సర్కారు పంట రుణాల మాఫీలో తల తాకట్టు పెట్టయినా సరే ఇచ్చి నమాట నిలబెట్టుకోవాలని పట్టుదలతో ముందుకు సాగుతోంది.




## కులగణనపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు: బండి సంజయ్

- కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగం మాత్రమే
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13:కులగణనపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, ఇదంతా కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఆదివారం ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీపై సంచలన ఆరోపణలు చేశారు. కులగణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన దుర్మార్గమైనదని, చిత్తశుద్ధితో చేసే ప్రయత్నం చేయట్లేదని విమర్శించారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలను ఆలస్యంగా నిర్వహించేందుకు తప్పించుకునే దోరణిలో వ్యవహరిస్తుందని మండిపడ్డారు.గతంలో కెసిఆర్ సమగ్ర కుటుంబ సర్వే జరిపిన విషయాన్ని

వివరాలు 2లో

## కలుషిత నీటి సరఫరా వల్ల జరిగిన మరణాలు

- ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13: కలుషిత తాగునీరు తాగి సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు మరణించిన ఘటనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ అంతటా తాగునీరు సరఫరా చేయడానికి కెసిఆర్ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మిషన్ భగీరథ ప్రాజెక్టు పూర్తి చేసిందని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ జలాలను శుద్ధి చేసి రాష్ట్రమంతటా తాగు నీరు ఇచ్చే ఈ ప్రాజెక్టును కూడా రేవంత్ సర్కార్ సరిగ్గా నిర్వహించలేకపోతుందని మండిపడ్డారు.సంజీవన్‌రావుపేటలో కలుషిత నీటి సరఫరా వల్ల జరిగిన మరణాలు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, చికిత్స పొందుతున్నవారికి తగిన సాయం అందించాలని, తెలంగాణలో మరెక్కడ ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగకుండా చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'దేవరగట్టు' కర్రల సమరంలో

## చిందిన రక్తం




- 70 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13: ఎపిలోని దేవరగట్టు కర్రల సమరంలో ఎలాంటి హింస జరగకుండా ఆపేందుకు పోలీసులు ముందస్తుగా చేపట్టిన చర్యలు, అధికారులు వేసిన ప్రణాళికలు ఫలించలేదు. తత్ఫలితంగా కర్రల సమరంలో 70 మంది గాయపడ్డారు. గాయపడిన వాళ్లను ఆసుపత్రికి తరలించగా వారిలో

వివరాలు 2లో

## ఎన్‌సిపి నేత బాబా సిద్ధిఖీ హత్య



తొలి అక్షరం/ముంబై,అక్టోబర్ 13: ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత బాబా సిద్ధిఖీ (66)తుశనివారం సాయంత్రం ముంబై లోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా తుపాకీ కాల్పులకు గురయ్యారు. ఆయన కుమారుడు కూడా రాజకీయాల్లో ఉన్నారు. వెంటనే సిద్ధిఖీని లీలావతి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరిని పోలీస్‌లు అరెస్ట్ చేశారు.మాజీ మంత్రి అయిన సిద్ధిఖీ మహారాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ నాయకుడుగా ఉంటున్నారు. వచ్చే నెల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ హత్య జరగడం సంచలనం కలిగిస్తోంది. గత ఫిబ్రవరి వరకు కాంగ్రెస్‌లో కీలక స్థానం వహించిన సిద్ధిఖీ తరువాత కాంగ్రెస్ నుంచి

వివరాలు 2లో


## వరంగల్‌లో భగ్గుమన్న కాంగ్రెస్ వర్గ విభేదాలు.. పరిస్థితి ఉద్రిక్తం..



తొలి అక్షరం/వరంగల్:అక్టోబర్ 13: ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వర్గీయుల మధ్య ఫ్లెక్సీ వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది.ధర్మారంలో మంత్రి కొండా వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో రేవూరి ఫొటో లేదంటూ ఆయన వర్గీయులు వాటిని చింపివేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తమ అభిమాన నేత మంత్రి కొండా ఫ్లెక్సీలు చింపివేయడంపై

వివరాలు 2లో

## ప్రభుత్వ గాంధీ వైద్య కళాశాలకు ప్రొ. సాయిబాబా భౌతిక శరీరం దానం




తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13: ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా(58) పార్థివ శరీరాన్నిఆయన కుటుంబ సభ్యులు ఇక్కడి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కు దానం చేశారు. ఆయన కోరుకున్న విధంగానే ఆయన శరీరాన్ని దానం చేస్తున్నట్లు వారు తెలిపారు. అక్టోబర్ 14న ప్రభుత్వ గాంధీ మెడికల్ కాలేజ్ కు ఆయన భౌతిక కాయాన్ని అందజేయనున్నట్లు వారు తెలిపారు.ప్రొ. సాయిబాబా ఆపరేషన్ అయ్యాక తలెత్తిన సమస్యల కారణంగా మరణించారు. మావోయిస్టులతో సంబంధం ఉందన్న కేసులో ఆయన ఏడు నెలల కిందట

వివరాలు 2లో

## నేడు గ్రూప్ 1 హాల్‌టికెట్లు విడుదల



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13:** తెలంగాణలో ఈనెల 21 నుంచి గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో నేడు( అక్టోబర్ 14) నుంచి ఆన్ లైన్ లో హాల్‌టికెట్లు అందుబాటులోకి వస్తాయి. టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ వివరాలు ఎంటర్ చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మెయిన్స్‌కు మొత్తం 31,382 మంది అర్హత సాధించారు. ఇందులో జనరల్ ఇంగ్లిష్ సహా మొత్తం 7 పేపర్లు ఉంటాయి. ఇంగ్లిష్ తప్ప అన్ని పేపర్లను తె లుగు, ఉర్దూ, ఇంగ్లిష్‌లో రాయవచ్చు. ఈనెల 27 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 563 గ్రూప్ 1 ఖాళీల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టారు.

## తెలంగాణ సాధనకు 'అలయ్ బలయ్' స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని సామాజికవర్గాలు కార్యోన్ముఖులు కావడానికి అలయ్ బలయ్ దోహదపడిందని సీఎం వివరించారు.తెలంగాణ సాధనకు రాజకీయ జేఏసీ ఆవిర్భావానికి కూడా అలయ్ బలయ్ ఉపయోగపడిందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు అతిపెద్ద పండగ దసరా పర్వదినాన అందరికీ గుర్తొచ్చేది పాలపిట్ట, జమ్మిచెట్టు అన్నారు. మరోవైపు 'అలయ్ బలయ్' అంటే గుర్తొచ్చేది బండారు దత్తాత్రేయ అని సిఎం కొనియాడారు. తెలంగాణ సంస్కృతిని నలుదిశలా వ్యాపింపచేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. దత్తాత్రేయ వారసత్వాన్ని ఆయన కుమార్తె విజయలక్ష్మి ముందుకు తీసుకు వెళ్లడం అభినందనీయమని సిఎం అన్నారు. తెలంగాణ ఉద్యమంలో జెండాలకు అజెండాలకు అతీతంగా ఒక పొలిటకల్ జేఏసీని ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడానికి ఈ అలయ్ బలయ్ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిగా పనిచేసిందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## హరీష్ రావుకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్..



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13:** రాష్ట్ర మంత్రి మంత్రి శ్రీధర్ బాబు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. కాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా.. అతనికి ఇటీవల ప్రభుత్వ విప్ పదవి ఇచ్చారు. కాగా దీనిపై హరీష్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్పీకర్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.అయితే హరీష్ రావు వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. రాజ్యాంగానికి లోబడే పట్నం మహేందర్‌రెడ్డిని మండలి చీఫ్‌విప్‌గా నియమించాం. ప్రతి దాన్ని హరీశ్ రావుకు రాజకీయం చేయడం అలవాటుగా మారిందని.. వ్యవస్థలను అనవసరంగా రాజకీయాల్లోకి లాగుతు న్నారని, హరీష్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ను బీఆర్ ఎస్‌లోకి ఎలా చేర్చుకున్నారని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు.

## వరంగల్‌లో భగ్గుమన్న కాంగ్రెస్ వర్గ విభేదాలు.. పరిస్థితి ఉద్రిక్తం..

(మొదటి పేజీ తరువాయి)

ఆమె అభిమానులు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. భారీగా చేరుకున్న నేతలు, కార్యకర్తలంతా వరంగల్‌- నర్సంపేట ప్రధాన రహదారి ధర్మారం వద్ద రాస్తారోకో నిర్వహించారు.రేవూరి ప్రకాశ్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే రేవూరి తమపై అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నా రంటూ ఆందోళనకు దిగారు. కొండా వర్గీయుల ధర్నాతో వరంగల్‌- నర్సంపేట రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లా రాజకీయాలు వేడెక్కాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో గీసుగొండ పోలీస్ స్టేషన్‌కు మంత్రి కొండా, సీపీ అంబర్ కిషోర్ ఝా చేరుకున్నారు. తమ వర్గీయులపై కేసుకు సంబంధించిన వివరాలను సీపీని అడిగి మంత్రి కొండా సురేఖ వివరాలు తెలుసుకున్నారు.

# ధాన్యం 'కొలత'లతో కొత్త చిక్కులు!

- గింజను బట్టి బోనస్‌కు ఎంపిక
- నిరంతర పర్యవేక్షణకు కమిటీలు
- ధృవీకరణలో ఈక్రాప్ పత్రాలే ప్రామాణికం
- ఒకటికి రెండు సార్లు గింజల పరీక్ష

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13:** వ్యవసాయరంగంలో అధునాతన సాంకేతిక అందుబాటులోకి వస్తున్నా వాటి పట్ల రైతుల్లో అవగాహణ కల్పించటంలోనే తగిన వేగం అందుకోలేక అధికార యంత్రాగం ఆపసోపాలు పడుతోంది. ప్రభుత్వం ఆశించిన ఫలితాలు అందించటంలో వెనుకబడుతోంది. రాష్ట్రంలో తొలిసారి ధాన్యం గింజల కొలతల ప్రక్రియ రైతుల్లో భయాలను పుట్టిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నేలల స్వభావం ,వాతావరణం తదితర అంశాల వల్ల ధాన్యం గింజ సైజులో కొద్దిగా మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయని , అటువంటి రకాలను సన్నధాన్యంగా గుర్తించకపోతే నష్టపోతామన్న సందేహాలు రైతులనుంచి వ్యక్తమవుతున్నాయి.బియ్యం గింజల కొలతల ప్రక్రియ పట్ల వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖలకు చెందిన వాటిలో ఏవి ఇంతవరకూ రైతుల్లో సరైన అవగాహన కల్పించలేకపోయాయి. రాష్ట్ర వ్యవసాయరంగం చరిత్రలో ఇప్పటివరకూ ధాన్యానికి కనీస మద్దతు ధరలు ..వాటి గ్రేడ్‌లను బట్టి నిర్ణయిస్తూ వచ్చారు. ఏగ్రేడ్ ,కామన్ గ్రేడ్ రకాలుగానే ధాన్యాన్ని ప్రభుత్వం సేకరిస్తూ వస్తోంది. ఏ గ్రేడ్ రకానికి కామన్ గ్రేడ్ కంటే 20రూపాయల మేరకు అధికంగా ధర చెల్లించేవారు. ఇక సన్నరకం ధాన్యం అయినా , దొడ్డు రకం ధాన్యం అయితే ఇదే గ్రేడ్‌ల కిందే కొనుగోలు జరిగేవి.సన్నరకం ధాన్యం అధికంగా ప్రైవేటు వ్యాపారులే కాస్తో కూస్తో అధికంగా ధర చెల్లించి కొనుగోలు చేస్తుండటంలో ఈ రకం ధాన్యం కూడా ధాన్యం సేకరణ కేంద్రాలకు తక్కవగానే వచ్చేది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సన్నరకాల వరిసాగును ప్రొత్సహిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సన్నరకాలు పండించే రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం



క్వింటాలుకు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, కామన్ రకాలకు రూ.2300 ధరను ప్రకటించింది.కొనుగోలు కేంద్రాల్లో కూడా ఇదే ధరలతో కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని సేకరిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బిపిటి ,ఆర్ఎన్ఆర్, 15048, హెచ్ఎంటిసోనా , జై శ్రీరాం తదితర 33వరిరకాలను సన్నరకం ధాన్యాలుగా గుర్తించి ఆ మేరకు ఈ రకాలకు మాత్రమే క్వింటాలకు రూ.500బోనస్ ప్రకటించింది.**క్యాలిపర్స్ ద్వారా బియ్యం గింజ కొలత:** చిన్న చిన్న వస్తువుల కొలతలు నిర్ధారించే కాలిపర్స్ సాయంతో సన్నధాన్యం గుర్తింపు ప్రక్రియను చేపట్టనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.గ్రెయిన్ కాలిపర్స్ ద్వారా ఈ కొలతలను నిర్వహించనున్నారు. రైతులు బస్తాల్లో తెచ్చిన ధాన్యం నుంచి పరీక్ష నిమిత్తం పది గింజలను తీసుకుంటారు .ఈ గింజల పొట్టు తీసిన తర్వాత బియ్యం గింజను గ్రేయిన్ కాలిఫర్స్ సాయంతో కొలత వేస్తారు .గింజ పొడవు 6 మిల్లీమీటర్లు మించరాదు. అదే విధంగా గింజ వెడల్పు 2మి.మి మించకుండా ఉంటే వాటిని సన్నరకంగా పరిగణిస్తారు. బియ్యం గింజ పొడవు వెడల్పు నిష్పత్తి 2.5 కటే ఎక్కువ ఉంటే వాటికి ప్రాధాన్యత ఇస్తారు. బియ్యంలో తేమ కూడా 17శాతం లోపే ఉండాలి. ఈ పరీక్షలకు నిలిచిన ధాన్యం మాత్రమే సన్నరకంగా ఎంపిక చేసి వాటికి మాత్రమే క్వింటాలకు రూ.500బోనస్ కలిపి మొత్తం రూ.2820 ప్రభుత్వం ఆ రైతుకు చెందిన బ్యాంకు ఖాతాకే నిధులు జమ చేస్తుంది.**సమస్యల పరిష్కారిని కమిటీలు:** రాష్ట్రంలో తొలిసారి సన్న రకం ధాన్యం సేకరణను ప్రభుత్వం ప్రత్యేకంగా చేపడుతుండటంతో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతె వాటిని వెంటనే పరిష్కరించేందకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. మండల స్థాయిలో కమిటీలను నియమించింది. తాసిల్దార్ , ఎంపిడివో, ఎస్ఐ, ఏఈవో, ఐకెపి ఎపిఎంవో, పిఏసిఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, మెప్మా సిఈవోలను ఈ కమిటీల్లో సభ్యులుగా నియమించింది. ఈ కమిటిలకు ఇప్పటికే ప్రాధమిక స్థాయిలో అవగాహణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు.**ఈక్రాప్ రికార్డులే ప్రామాణికం:** రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్ కింద అన్ని రకాల పంటలు కలిపి మొత్తం కోటి 29లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. ఇందులో 65.49లక్షల ఎకరాల్లో వరి సాగులోకి వచ్చింది. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతుల పంట పొలాలు పరిశీలించింది. రైతు పేరు, అధార్ నెంబర్, పొలం సర్వే నెంబర్ , సాగు చేసిన పంట, పంటలో విత్తన రకం ,విస్తీర్ణం తదితర అంశాలను ఈ క్రాప్ పోర్టల్ ద్వారా నమోదు చేశారు. రైతులు తాము పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు, వ్యవసాయ మార్కెట్లకు తీసుకుని వెళితే ముందుగా వ్యవసాయాశాఖ అధికారుల ద్వారా ఈ క్రాప్ ధృవీకరణ పత్రం తీసుకోవాలి.అందులో ఆ రైతు పంటకు సబంధించిన అన్ని వివరాలు పొందు పరిచి ఉంటాయి. ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యంలో 91లక్షల మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసింది. అందులో 50లక్షల టనులు సన్నరకం ధాన్యమే వస్తుందని అంచనా వేసి ఆమేరకు కొనుగోలు ప్రణాళికలను సిద్దం చేసింది. ధాన్యం నుంచి గింజలను తీసి శాంపిల్ కింద బియ్యం గింజలను కొలిచే క్రమంలో ఈ క్రాప్ ధృవీకరణ పత్రం కూడా ప్రామాణికంగా మారనుంది. రైతులు తాము పండించిన ధాన్యం శాంపిళ్ల పరీక్షలో తేడాలు వస్తే ఒకటికి నాలుగు సార్లు ధాన్యం గింజలను పరీక్షకు పెట్టి ఈ క్రాప్ పత్రాన్నికూడా ఆధారంగా చూపాలని అధికారులు సూచిస్తున్నారు.

## కులగణనపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు: బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ మర్చిపోయిందా? కెసిఆర్ నిర్వహించిన సర్వే రిపోర్టులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అప్పుడు కెసిఆర్ బయటపెట్టలేదని, ఇప్పుడు వీళ్లు కూడా బయటపెట్టట్లేదని ఆరోపించారు. వీరిద్దరి మధ్య ఉన్న చీకటి ఒప్పందమేమిటో చెప్పాలని బండి నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అప్పటి సర్వేతో ఏం లాభం చేకూరిందని, మళ్లీ ఈ రోజు కాంగ్రెస్ కులగణన పేరుతో రూ.150 కోట్లు కేటాయించి, 60 రోజుల సమయం ఇచ్చి సర్వే చేయిస్తుందని అన్నారు. ప్రజల కులాలు మారాయా, లేక కుటుంబసభ్యులు ఏమైనా మారారా? దీనిలో ఉన్న ఉద్దేశం ఏమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.కులగణన అనేది ఒక ఫేక్ అని వ్యాఖ్యానించారు. దానికి 150 కోట్లు కేటాయించడం కూడా ఫేక్ అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామని, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న వ్యతిరేకతను గుర్తించి ఇదంతా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని ప్రజలు నిలదీస్తారని, రుణమాఫీ విషయంలో రైతులు సీరియస్‌గా ఉన్నారని భయపడి కాంగ్రెస్ పార్టీ తప్పించుకునే ధోరణిలో భాగంగానే కులగణన పేరుతో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఇదంతా కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని ఆరోపించారు.ం

## 'దేవరగట్టు' కర్రల సమరంలో చిందిన రక్తం

(మొదటి పేజీ తరువాయి)



ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వెల్లడించారు. ఎపిలోని కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు ప్రాంతంలో ఏటా దసరా రోజు అర్ధరాత్రి బన్ని ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవంలో కర్రల సమరం ఉంటుంది.అంటే కర్రలతో రెండు గ్రూపులు కొట్టుకుంటాయి. ఈ కర్రల సమరంలో ఈసారి వేడుకల్లో 70 మంది గాయపడ్డారు. దేవతామూర్తుల కోసం ఈ కర్రల సమరం జరుగుతుంది. హింసకు తావులేకుండా బన్ని ఉత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు ఎలాంటి సత్ఫలితాలను ఇవ్వలేదు. ఈసారి కూడా ఎప్పటిలాగే హింస చెలరేగింది. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో 70 మంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషయంగా ఉంది. గాయపడిన వారికి ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు.దసరా సందర్భంగా కర్రల దేవరగట్టు ప్రజలు కర్రల సమరాన్ని దశబ్దాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఏటా జరిపే ఈ ఉత్సవం ఆనవాయితీగా వస్తోంది. కర్నూలు జిల్లా ఆలూరు సమీపంలోని దేవరగట్టు వద్ద కొండపై వెలిసిన మాళమల్లేశ్వరస్వామి ఆలయం ఉంది. ఎప్పటిలాగే దేవతామూర్తులైన మాళమ్మ, మల్లేశ్వరస్వామికి దసరా రోజు అర్ధరాత్రి 12 గంటలకు కల్యాణం నిర్వహించారు. అనంతరం కొండకు సమీప ప్రాంతాల్లో పాదాలగట్టు, రక్షపడ, శమీవృక్షం, ఎదురుబసవన్న గుడి మీదుగా దివిటీల వెలుగుల్లో ఆ దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా దేవతా మూర్తుల విగ్రహాలను దక్కించుకోవడమే లక్ష్యంగా 5 గ్రామాల ప్రజలు ఓ వర్గంగా, మరో 3 గ్రామాల ప్రజలు ఇంకో వర్గంగా ఏర్పడి కర్రలతో సమరానికి దిగుతారు.దీనినే దేవరగట్టు కర్రల పోరు అంటారు. మాళమ్మ, మల్లేశ్వర స్వామివార్లు రాక్షసున్ని సంహరించిన అనంతరం బన్ని ఉత్సవం నిర్వహిస్తారు. తమ ఇలవేల్పు అయిన దేవతామూర్తులను స్వాధీనం చేసుకోవటం కోసం నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల ప్రజలు ఓ జట్టుగా ఏర్పడ్డారు. సుళు వాయి, ఆలూరు, ఎల్లార్తి, అరికెర, నిద్రవట్టి, బిలేహాల్ తదితర గ్రామాల ప్రజలు మరో జట్టుగా కర్రలతో తలపడ్డారు. ఇందులో ఇరువర్గాలకు చెందిన వారు తీవ్రంగా గాయపడ్డారు.ఈ కర్రల సమరాన్ని చూడటానికి రాష్ట్రం నలుమూలనుంచే నుంచే కాకుండా కర్ణాటక నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. బన్ని ఉత్సవంలో హింసను నివారించడానికి 800 మంది పోలీసులు మోహరించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దేవగట్టు పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘాను పటిష్ఠం చేసినప్పటికీ రక్తం చిందింది. గాయపడ్డవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటం వల్ల ఆదోని ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.


## ఎన్‌సిపి నేత బాబా సిద్ధిఖీ హత్య

(మొదటి పేజీ తరువాయి)

వైదొలగి ప్రాంతీయ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి అజిత్‌వర్గం)లో చేరారు. మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలో అజిత్‌వర్గం ఎన్‌సిపి భాగస్వామ్యం అయిన సంగతి తెలిసిందే. సిద్ధిఖీ హత్య పిరికి చర్యగా అజిత్ పవార్ వ్యాఖ్యానించారు.ఈ సంఘటన విని తాను షాక్‌కు గురయ్యానని చెప్పారు.బాబా సిద్ధిఖీని చంపింది మేమే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటన సిద్ధిఖీని హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది.ఈ కేసులో అరెస్టయిన హరియాణాకు చెందిన కర్నైల్ సింగ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ కశ్యప్ అనే ఇద్దరు నిందితులు తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కు చెందినవారమని పేర్కొన్నట్టు ఇప్పటికే పోలీస్ వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. మూడో నిందితుడైన యూపీకి చెందిన శివకుమార్‌ను పోలీస్‌లు ఆదివారం అదుపు లోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. బిష్ణోయ్ ప్రస్తుతం జైలులో ఉన్నాడు. సిదూ మూసేవాలాను 2022లో హత్యతోపాటు అనేక హత్యకేసుల్లో ఆయన జైలుశిక్ష అనుభవిస్తున్నాడు.సిద్ధిఖీని హత్య చేయడానికి నిందితులు కొన్ని నెలలుగా ప్రణాళికలు రచించారని , ఆయనకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సిద్ధిఖీ నివాసం, కార్యాలయంపై నిఘా పెట్టారని తెలిపారు. ఈ హత్య చేసినందుకు గాను నిందితులకు ఒక్కొక్కరికి బిష్ణోయ్ గ్యాంగ్ రూ.50,000 అడ్వాన్స్ , మారణాయుధాలు ఇచ్చినట్టుగా తమ విచారణలో తేలిందని పోలీస్‌లు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్‌ఖాన్ ఇంటివద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇది ట్రైలర్ మాత్రమే .ముందుంది అసలు సినిమా అంటూ ఆనాడు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ పోస్ట్ పెట్టారు. తాజా సంఘటన నేపథ్యంలో సల్మాన్ ఇంటివద్ద భద్రతను పెంచారు.**కన్నీటి పర్యంతమైన శిల్పాశెట్టి..** సిద్ధిఖీకి నివాళి అర్పించేందుకు రాజకీయ నాయకుడు , సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. సినీ నటి శిల్పాశెట్టి , ఆమె భర్త రాజ్‌కుంద్రా నివాళులు అర్పించారు. ఆస్పత్రి నుంచి బయటకు రాగానే శిల్పాశెట్టి తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. బిగ్‌బాస్ 18 షూటింగ్ రద్దు .. ఆస్పత్రికి సల్మాన్‌తన స్నేహితుడు సిద్ధిఖీ హత్యకు గురైనప్పుడు సల్మాన్ ఖాన్ బిగ్‌బాస్ వీకెండ్ ఎపిసోడ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. మరణవార్త విన్న వెంటనే మిగిలిన షూటింగ్ రద్దు చేసుకుని ఆస్పత్రికి బయల్దేరారు. సిద్ధిఖీ హత్యకు నిరసనగా ఆదివారం పార్టీ కార్యకలాపాలన్నిటినీ రద్దు చేశామని ఎన్సీపీ ప్రకటించింది. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది.**దేశం మొత్తం భయపడుతోంది : కేజ్రీవాల్... న్యూఢిల్లీ :** సిద్ధఖీ హత్య మహారాష్ట్ర బాలీవుడ్‌లో సంచలనం రేపుతోంది. ఈ సంఘటనపై ఎక్స్ వేదికగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఈ హత్యతో మహారాష్ట్ర మాత్రమే కాదు, దేశం మొత్తం భయపడుతోందన్నారు. ఢిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని, గ్యాంగ్‌స్టర్ పాలన తీసుకురావాలనుకునే వారికి వ్యతిరేకంగా ప్రజలు నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ం

## ప్రభుత్వ గాంధీ వైద్య కళాశాలకు ప్రొ. సాయిబాబా భౌతిక శరీరం దానం

(మొదటి పేజీ తరువాయి)




విడుదలయ్యారు. ప్రస్తుతం ఆయన భౌతిక కాయం నిమ్స్ మార్చురీ లో ఉంచారు. అక్టోబర్ 14న గన్ పార్క్ కు తీసుకెళతారు. అక్కడి నుంచి ఆయన సోదరుడి ఇంటికి తరలిస్తారు. అక్కడ ప్రజలు ఆయనకు నివాళులు ఇవ్వడానికి ఉంచుతారు. తర్వాత సంతాప సమావేశం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయిబాబా గాల్ బ్లాడర్ ఇన్ఫెక్షన్ తో బాధపడ్డారు. రెండు వారాల కిందటే ఆయనకు ఆపరేషన్ జరిగింది. కానీ తర్వాత సమస్యలు తలెత్తాయి. చివరికి శనివారం ఆయన కన్నుమూశారు.ప్రొఫెసర్ సాయిబాబాకు భార్య, కూతురు ఉన్నారు. " తన భౌతిక కాయాన్ని దానం చేయాలని ఆయన ఎన్నడూ కోరుకునేవారు. ఇప్పటికే ఆయన కళ్లను ఎల్ వి ప్రసాద్ ఐ హాస్పిటల్ కు దానం చేశాము. ఆయన భౌతిక కాయాన్ని కూడా రేపు (అక్టోబర్ 14న) హాస్పిటల్ కు అందజేస్తాం" అన్నారు ఆయన కూతురు మంజీర.

## అంతర్జాతీయ హిందూ దేవాలయాల,ఆధ్యాత్మిక వేద జ్యోతిష్కుల సమ్మేళనంలో అవార్డు అందుకొన్న శ్రవణ్ కుమార్ శాస్త్రి






**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 13:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం నుండి ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు దేశ రాజధాని న్యూ ఢిల్లీలో జూన్ లో ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రో ఫెడరేషన్ ఆధ్వర్యంలో అందుకోవడం జరిగింది. మార్చి 10న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో, ఆర్యన్ ఆస్ట్రో రీసెర్చ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో జ్యోతిష వాస్తు బ్రహ్మ బిరుదు అందుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నెక్కొండ పట్టణ రామాలయంలో చిన్ననాటి మిత్రుడు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్ ని, సన్మానించిన మారం రాము దంపతులు, మరియు కొమ్ము రమేష్ యాదవ్ దంపతులు, కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి దంపతులు, తాటి పెల్లి శివకుమార్ దంపతులు, గన్ను సత్యం దంపతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కెనడాలో తెలుగు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ నిమజ్జనం వేడుకలు





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** ఎళ్లలు దాటినా తమ సాంప్రదాయాలను భారతీయులు మరవరన్నది నానుడి.ప్రత్యేకించి తెలంగాణా వాదులు ఎంతో ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగను కూడా తామున్న దేశంలోనే జరుపుకొంటూ సంస్కృతిని,తమ సాంప్రదాయాన్ని మరవటం లేదు. కెనడా లోని సదరన్ ఒంటారియో తెలుగు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కిచెనర్ లో గత తొమ్మిది రోజులుగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలు శనివారం ముగిశాయి.పరిసర ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో హాజరై బతుకమ్మ వేడుకలను సాంప్రదాయిక పద్ధతిలో నిర్వహించారు.చివరి రోజు బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పింగళి రమాదేవి వెంకటేశ్వరరావు, మానస, అరుణ, మీనా,రమ్య, శృతి,రవళి,సంధ్య, శ్రీలత,సుధ తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండను కలిసిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా మండల నాయకులు

**తొలి అక్షరం/చిట్యాల, అక్టోబరు 13:** తెలంగాణ తొలి శాసనసభ ప్రతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి పుట్టినరోజు సందర్భంగా ప్రతిపక్ష నేతగా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని చిట్యాల మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు హైదరాబాదులో గల వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేయడం జరిగింది.. ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత పదవి మూలంగా తనపై మరింత బాధ్యత పెరిగిందని ఇక నుండి భూపాలపల్లి నియోజకవర్గంలో ని ప్రజలకు అందుబాటులో పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని కార్యకర్తలు నాయకులు కంటికి రెప్పల కాపాడుకుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేష్ ముదిరాజ్ మండల నాయకులు .పువ్వాటి హరికృష్ణ. కోడెల రాజమల్లు .గురుకుంట్ల కిరణ్ .ఉప్పుల కిరణ్ రాయిని శ్రీకాంత్ .వేణు వంక శ్రీదేవి. మోత్కూరి సంతోష్ .బొట్ల రవి బోనగిరి గోవర్ధ.న్ ఇజిగిరి ఆనందం .ఎండి శంషోద్దీన్ కంచర్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గొల్ల కురుమల కులదైవం కొమురవెల్లి మల్లన్న స్వామి దేవాలయం దర్వాజా కార్యక్రమం

- శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళి నాయక్







**తొలి అక్షరం/కొరవి, అక్టోబర్ 13:** మండల కేంద్రంలోని మాదావ పురం గ్రామంలో యాదవ సంఘం కులస్తులు నూతనంగా నిర్మిస్తున్నటువంటి శ్రీ కొమరవెల్లి మల్లన్న దేవాలయ నూతన శంకుస్థాపన కార్యక్రమానికి ఆ యొక్క మాదావ పురం గ్రామస్తుల ఆహ్వానం మేరకు వెళ్లి పాలకాయ కొట్టి ఆ దేవాలయ పనులనుప్రారంభించిన లిమహబూబాబాద్ శాసనసభ్యులు శ్రీ డాక్టర్ భూక్య మురళి నాయక్ తన వంతు సహాయం చేస్తానన్నా ఎమ్మెల్యే మురళి నాయక్అలాగే చెరువు కట్టె పక్కనే నుతంగా నిర్వహిస్తున్నటువంటి వయంబు గంగమ్మ దేవి ఆలయాన్ని సందర్శించరు ఈ కార్యక్రమంలో మాదావ పురం గ్రామ ఎంపీటీసీలు మాజీ వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకులు పార్టీ శ్రేణులు కార్యకర్తలు యాదవ సంఘం కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రజక విద్యాభవన్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్13:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హన్మకొండ 10,31 వ డివిజన్ లో వీరనారి చాకలి అయిలమ్మ విగ్రహం వద్ద కోటి రూపాయల నిధులతో నిర్మాణం చేస్తున్న రజక విద్యాభవన్ కు వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎస్.కుమార్ యాదవ్,అన్నేశ్వరపు సురేందర్,తెలంగాణా హై కోర్ట్ జడ్జ,కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు చీకటి ఆనంద్ సత్తు రమేష్, ఎల్లయ్య.చీకటి వీరస్వామి,మిర్జా అజీజుల్లా బేగ్,కే. కృష్ణ,మంద రాకేశ్,ఏఈ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## జమాతే ఉలేమ డిస్ట్రిబ్యూషన్ ప్రైసెస్ జల్సా సీరతున్నబి జమ్మికుంట...



**తొలి అక్షరం/హుజూరాబాద్, అక్టోబర్ 13:** ఆదివారం రోజు జమ్మికుంట పట్టణంలోగల సువర్ణ ఫంక్షన్ హాల్ లో జరిగిన హుజూరాబాద్ జమ్మికుంట జమాతే ఉలేమ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా హుజరాబాద్ జమ్మికుంట జమాతే ఉలేమా సంఘ అధ్యక్షులు మిర్జా ఇమ్రాన్ బేగ్ జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనాబ్ మహమ్మద్ యూనుస్ జనాబ్ గయాసమునుద్దీన్ జనాబ్ మొహమ్మద్ సిద్ధిక్ హుసేని హుజరాబాద్ జామే మజీద్ ఈద్గా కబ్రుస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఖురేషి మజీద్ అధ్యక్షులు మొహమ్మద్ జాకీర్ మహమ్మద్ ఫసి మొహమ్మద్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో జనాబ్ మహమ్మద్ సల్లల్లాహు సల్లం నదికి సంబంధించిన పరీక్షలలో (300) మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పరీక్షలలో మంచిగా రాసి సమాధానాలు ఇచ్చిన వారికి ఈరోజు బహుమతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ముస్లిం మహిళలు దాదాపు (300) మంది ఈ యొక్క జల్సా కార్యక్రమంలో పాల్గొన్నారు పాల్గొన్న అందరికీ భోజనముతో పాటు గెలిచిన విద్యార్థి విద్యార్థినీలకు బహుమతులు పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఈ యొక్క జల్సా కార్యక్రమంలో జనాబ్ సల్లల్లాహు అలై సల్లం అయినా పుట్టినప్పటి నుండి మరణించే వరకు ఎలాంటి మంచి కార్యక్రమంలో ఈ సమాజంలో ప్రజల కొరకు చేశారు ఆ యొక్క మంచి కార్యక్రమంల%శ్రీ% గురించి మరియు ప్రతి ముస్లిం సోదరుడు ఐదు పూటల నమాజు తప్పకుండా చదవాలి ప్రతి ముస్లిం సోదరుడు ప్రతి ఒక్కరు ఖురాన్ షరీఫ్ ను తప్పకుండా రోజువారి చదవాలి ఇతర వ్యక్తులతో ఎంత మంచిగా కలిసి మెలిసి అన్న తమ్ముల్లాగా ఉండాలి ప్రతి ఒక్కరు అందరము కలిసిమెలిసి ఉంటూ ఒకరి ఆపదలో ఇంకొకరు సహాయం చేయాలి అలా కలిసి ఉంటే అల్లా తాళ కూడా సంతోషపడతాడు ఎవరైనా పేదరికంతో తినడానికి తిండి లేక కట్టుకోవడానికి బట్టలేక అలా జీవిస్తున్న వారికి మనము కూడా తోటి సహాయం చేసి అలాంటి వ్యక్తులను ఆదుకున్నప్పుడే అల్లా తల సంతోష పడతాడు ప్రపంచంలో అందరమూ అన్ని కులాలు మతాలు అందరూ ఒకరే కనుక ఎవరిని బాధ పెట్టకూడదు ఎవరైనా ఇబ్బందిలో ఉన్నట్టయితే అతనికి మనము తగిన సహాయం చేసి అలాంటి వ్యక్తిని ఆదుకున్నప్పుడే భగవంతుడు కూడా సంతోషపడతాడు పతి ముస్లిం సోదరుడు రంజాన్ నెలలో ఉపవాసాలు ఉండాలి ప్రతిరోజు ఐదు పూటలా నమాజు చదవాలి ఎల్లప్పుడు అల్లాను ప్రార్థన చేయాలి ఈ సందర్భంగా హుజురాబాద్ డివిజన్ మజీద్ ఈద్గా ఖబ్రస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రపంచంలో మనమందరం కలిసి మెలిసి ఉండాలి ఒకరికి ఒకరు సహాయం చేసుకోవాలి ఎవరికైనా ఏదైనా ఇబ్బంది ఏర్పడినట్లైతే అలాంటి వ్యక్తిని మనం ఆదుకున్నప్పుడు భగవంతుడు కూడా సంతోషపడతాడు మనకు ఏదైనా ఇబ్బంది ఏర్పడినప్పుడు వేరే వ్యక్తి ద్వారా మనకు భగవంతుడు సహాయం చేయిస్తాడు కనుక మనమందరం ప్రపంచంలో కలిసి మెలిసి ఉండాలని ఒకరికి ఒకరు సహకరించుకోవాలని ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అందరికీ పిలుపు ఇచ్చారు బహుమతులు గెల్చుకున్న విద్యార్థి విద్యార్థినులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా మహమ్మద్ జాకీర్ మాట్లాడుతూ జమ్మికుంటలో జమాతే ఉలేమా కార్యక్రమం పెట్టటం ఇంత మంచి భారీ ఎత్తున ప్రజలు రావడం చాలా సంతోషంగా ఉందని ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని జమాతే ఉలేమా సంఘం నాయకులకు అయిన విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతరకు "వినోద్ రెడ్డి"కి ఆహ్వానం..






**తొలి అక్షరం/నెల్లికుదురు, అక్టోబర్ 13:** శ్రీ శ్రీ కళావేధిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహితికళా జాతరకు ప్రముఖ కవి, రచయిత,జానపద,యక్షా గాన కళాకారుడు బొమ్మిడి వినోద్ రెడ్డి కి ఆహ్వాహన మేరకు వెళ్లనున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం లో ఈ నెల 19,20 వ తేదీలలో జరుగు శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహితీ కళా ప్రదర్శనలకు అల్లూరి సీతారామరాజు ఏకపాత్ర అభినయం ప్రదర్శించడానికి సాహిత్య ప్రభంజనంలో తన అమూల్యమైన కవిత్వాన్ని వినిపించుటకు అంతర్జాతీయ శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి జాతీయ కార్యదర్శి టి పార్థసారథి అహ్వానం శ్రీ రామగిరి జానపద మహిళా కళాకారులు కోలటం ప్రదర్శనకు సైతం వినోద రెడ్డి ఆధ్వర్యంలో వెళ్లనున్నట్లు. ఈమేరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల శ్రీరామగిరి గ్రామానికి చెందిన బొమ్మిడి వినోద్ రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేశారు.ఈ సాహితీ కళాజాతరలో కవులు కళాకారుల ప్రదర్శనలకు నిర్దేశిత సమయంలో ప్రతిభ కనబరిచిన వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డును కైవసం చేసుకునే అవకాశం కూడా ఉందని వినోద్ రెడ్డి మీడియా మిత్రులకు తెలియ జేశారు. గ్రామస్తులకు మండలాధి కారులకు తెలియపరుస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా అపాయింట్మెంటు

- మేఘనను అభినందించిన చిత్తారి అనంతయ్య

- (రాష్ట్ర కమిటీ,తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగం,ఏబిబిజె లాయర్స్ అసోసియేషన్) -చిత్తారి అనంతయ్య



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు), అక్టోబర్13:** పానేటి శోభారాణి యాదయ్య తొగరుపల్లి గ్రామము కొండాపూర్ మండలం సంగారెడ్డి జిల్లా వాస్తవ్యులైన వారి ప్రథమ పుత్రిక పానేటి మేఘన డీఎస్సీ 2024 సెకండ్ గ్రేడ్ టీచర్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా ఎస్సీ మహిళా విభాగంలో జిల్లా ఒకటవ ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా అపాయింట్మెంటు తీసుకున్న సందర్భంగా వారికి వారి తల్లిదండ్రులకు సంగారెడ్డి జిల్లా,తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగాల తరపున ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేయడం జరిగినది.కుమారి పానేటి మేఘన వారి తల్లిదండ్రులైన పానేటి శోభారాణి యాదయ్య దంపతులు తన బిడ్డ భవిష్యత్తు గురించి విజయవాడ నందు హైదరాబాదు నందు ప్రత్యేక శిక్షణ తరగతులు ఇప్పించి ఈరోజు సంగారెడ్డి జిల్లా యందు మొదటి ర్యాంకు సంపాదించి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా రాణించడము చాలా సంతోషదాయకము.దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహము కుటుంబ సభ్యుల సహాయ సహకారము నిరంతరము చదువు పట్ల చూపించిన పట్టుదల ప్రశంసించ విషయం.ప్రతిష్టాత్మకమైన డిఎస్సీ-2024 ఎంట్రన్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్జిటీ సాధించిన మన విద్యా సరస్వతి పుత్రికకు తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగం అసోసియేషన్ తరపున అభినందనలు తెలియజేస్తున్నాము.ఎస్జిటీ పోస్ట్ సాధించడం బేడ బుడగ జంగం కులంలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతం అయిందని తెలియజేయుటకు తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగం అసోసియేషన్ తరపున సగర్వంగా ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నాము.ఈ విద్యా సరస్వతి పుత్రికలను ఆదర్శంగా తీసుకొని మన కులంలో ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులు ఏటేటా ప్రతి ఏటా ప్రభుత్వ ఉద్యోగాలు పొంది ఎదగాలని బేడ బుడగ జంగం సమాజానికి స్ఫూర్తిగా ఉండాలని కోరుకుంటూ తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగం అసోసియేషన్ తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము.


## కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర అధ్యక్షులు ఎంఎల్‌సి అభ్యర్థి గవ్వల లక్ష్మి-శ్రీకాంత్



**తొలి అక్షరం/మంచిర్యాల జిల్లా, అక్టోబర్ 13:** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ నివాసి, అనారోగ్యంతో మృతి చెందిన నవ యువకుడు యూత్ లీడర్ ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న అర్ధ రాత్రి పోన్ చేసిన నేనున్నానంటూ వచ్చి ఆపదలో అప్తబంధువుగా ఉండి కలుపుగోలుగా ఉండే రౌతు శ్రీకాంత్ అనారోగ్యంతో హాస్పిటల్ లో మృతి చెందిన యువకుని శవ యాత్రలో పాల్గొని తరువాత వారి కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ బి అర్ అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ పార్టీ వంచిత్ బహుజన్ అఘాడి (విబిఏ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ విద్యార్థి యువజన సంఘం (టివి వైఎస్) రాష్ట్ర అధ్యక్షులు మరియు ఉమ్మడి అదిలాబాద్, కరీంనగర్ నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల (ఎంఎల్ సి) అభ్యర్థి గవ్వల లక్ష్మి-శ్రీకాంత్ ఓదార్చి కుటుంబ సభ్యులందరికి ప్రగాఢ సానుభూతి తెలిపారు గవ్వల శ్రీకాంత్ వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబారి ప్రశాంత్ కుమార్, తీగల శేఖర్, సూర్య వంశీ విద్యాసాగర్ బిసి సంఘాల రాష్ట్ర అధ్యక్షులు కాముని గంగాధర్ నెతకాని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి ప్రేమ్ సాగర్ బిఎస్పీ చెన్నూర్ ఇంఛార్జి ముల్కల రాజేంద్రప్రసాద్ స్థానిక యువకులు సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాబా ఖాన్ చెరువు నాలాలను పునరుద్ధరించండి..

- అయోధ్య కాలనీలో నాలాపై ఆక్రమణలు
- చెరువు విస్తీర్ణం 37.33 ఎకరాలు
- 2014లో చెరువు ఆక్రమణలు 2.87 ఎకరాలు
- 2023లో కబ్జాలు 3.61 ఎకరాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి స్థానికులు జగదీశ్, కృష్ణ, అనీల్ విజ్ఞప్తి




**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 13:** నగర శివారులోని చెరువులపై ఫోకస్ పెట్టిన హైడ్రాకు బాబాఖాన్ చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందింది. తక్కువ స్థాయిలో ఆక్రమణలు జరుగుతున్న నేపథ్యంలో ఇక ముందు కబ్జాలు రాకుండా చూడాలని హైడ్రాకు స్థానికులు కోరుతున్నారు. గత పదేండ్లలో 2014 నుంచి 2023 వరకు బాబాఖాన్ చెరువులోకి ఆక్రమణలు కేవలం 26 గుంటలు(0.26ఎకరాలు) భూమి మాత్రమే కమబ్జాకు గురైంది. ఈ కబ్జాలు సమీపంలోని చెరువుల ఆక్రమణలతో పోల్చుకుంటే ఇవి చాలా తక్కువ. 2014లో బాబాఖాన్ చెరువు విస్తీర్ణం 37.33 ఎకరాలుగా ఉంటే. కబ్జాలు 2.87 ఎకరాలుగా ఉన్నాయి. అప్పుడు చెరువు విస్తీర్ణం 34.46 ఎకరాలుగా తగ్గింది. అదే బాబాఖాన్ చెరువు 2023 నాటికి 33.72 ఎకరాలుగా తగ్గింది. అంటే 0.26 ఎకరాలు ఆక్రమణలు జరిగింది. ఈ విధంగా బాబాఖాన్ చెరువు తక్కువస్థాయిలో ఆక్రమణలకు గురైతూ వస్తున్న నేపథ్యంలో ఈ చెరువులోకి మరిన్ని ఆక్రమణలు రాకుండా చూడాలని హైడ్రాను స్థానికులు జగదీశ్, కృష్ణ, అనీల్ లు బషీర్ బాగ్ లో విడుదల చేసిన ప్రకటన లో కోరుతున్నారు. చెరువుల్లోకి వచ్చిన ఆక్రమణలను కూల్చివేస్తున్న హైడ్రా అధికార యంత్రాంగం బాబాఖాన్ చెరువుపై ఫోకస్ పెట్టాలని, చెరువును పునరుద్దరించి చెరువుకున్న నాలాలను సైతం కాపాడాని కోరుతున్నారు. బాబాఖాన్ చెరువు నిండిన అనంతరం మిగులు జలాలు వెళ్ళేందుకు అలుగు నుంచి ఓ నాలా దిగువన ఉన్న సూరారం చెరువులోకి వెళ్తుంది. బాబాఖాన్ చెరువు అలుగు నాలా కాస్త రెండు నాలాలుగా చెరువుకు చేరువగా ఉన్న మసీదు ప్రాంతంలో ఏర్పడుతుంది. ఒక నాలా కాస్త మసీదు ప్రాంతంలో నుంచి నేరుగా సూరారం చెరువుకు వెళ్తంది. మరో నాలా కాస్త సర్వే నెంబర్లు 174(పార్టు), 176,179(పార్టు),180, 194(పార్టు),195(పార్టు) ల అయోధ్య కాలనీ మీదుగా వెళ్తుందని, పునరుద్దరించాలని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అయితే, ఇరిగేషన్ అధికారులు మాత్రం నాలాలను పునరుద్దరిస్తే ముంపులు ఉండవని పేర్కొంటున్నారు. ప్రస్తుతం అలుగు ఉందే కానీ, అలుగునుంచి వెళ్ళే నాలా, ఆ నాలా రెండుగా విడిపోయిన నాలాలు మాత్రం కబ్జాలపాలైందని, తద్వారా బాబాఖాన్ చెరువు క్రింద ఉన్న ఇండ్లు ముంపునకు గురవుతున్నాయని, నాలాలను పునరుద్దరించాలని స్థానికులు కోరుతున్నారు. నాలాను మూసేసి మసీదు ప్రాంతంలో రోడ్డును వేయడాన్ని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు అక్కడ పైపులు లేదా కల్వర్టును ఏర్పాటు చేసిన నాలాను పునరుద్దరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పైన పేర్కొన్న 174(పార్టు), 176,179(పార్టు),180, 194(పార్టు),195(పార్టు) సర్వే నెంబర్లలో నాలాను అయోధ్య కాలనీలో పునరుద్దరిస్తే చెరువు నీరు సాఫీగా సూరారం చెరువులోకి వెళ్తాయని స్థానికులు కోరుతున్నారు.

## సీఎం కప్ టార్చ్ రిలే విజయవంతం చేయండి: డీవైఎస్ఓ



**తొలి అక్షరం/పెద్దపల్లి,13:** సీఎం కప్ టార్చ్ రిలే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దపల్లి డి వై ఎస్ ఓ సురేష్ అన్నారు.సీఎం కప్ టార్చ్ రిలే అక్టోబర్-14 సోమవారం పెద్దపల్లి జిల్లాలోకి ప్రవేశించడం జరుగుతుందని, ఉదయం 9 గంటలకి సుల్తానాబాద్ శాస్త్రి నగర్ నుండి ప్రారంభమై ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ సుల్తానాబాద్ వరకు టార్చ్ రిలే నిర్వహించడం జరుగుతుందని పెద్దపల్లి డివైఎస్ఓ సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా సంఘాలు, క్రీడా అభిమానులు, క్రీడా పోషకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శివపల్లిలో షమీ పూజ నిర్వహించిన ఎమ్మెల్యే..



**తొలి అక్షరం/ఎలిగేడు,13:** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని తన స్వగ్రామమైన శివపల్లిలో విజయ దశమి సందర్భంగా షమీ పూజ నిర్వహించి గ్రామ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేసిన పెద్దపల్లి శాసనసభ్యులు విజయరామణారావు. శివపల్లి గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి ప్రశంస పత్రం అందజేసిన ఐసిఐ



**తొలి అక్షరం/పెద్దపల్లి,13:** ఐసిఐ కరీంనగర్ ప్రేరణ ఆధ్వర్యంలో గత విద్యాసంవత్సరం పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించి నందుకు గాను పద్దపల్లి పట్టణములోని శ్రీ అరబిందో కాకతీయ సెకండరీ పాఠశాల కి చెందిన కుమారి ప్రణవి కి ప్రశంస పత్రంతో సత్కారించడం జరిగింది. విద్యా ర్థినితోపాటు వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంతో పాల్గొనడం జరిగింది.

## పాస్టర్ల త్యాగం గొప్పది: ఐఎంఐ..



**తొలి అక్షరం/మంథని,13:** సమాజంలో శాంతి స్థాపన కోసం పాస్టర్లు చేస్తున్న త్యాగం గొప్పదని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. ఆదివారం ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో పాస్టర్ వల్లూరి ప్రభాకర్, పాస్టర్ మహేష్ లను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లు దేవుని సేవ చేస్తూ సమాజంలో శాంతి కోసం ఎల్లప్పుడూ ప్రార్థన చేస్తూ శాంతిని నెలకొల్పుతున్నారని పేర్కొన్నారు. సంఘ పెద్దలు ఎంకే జోసెఫ్, మంథని ప్రసాద్, అందె రమేష్, ఈర్ల సదానందం, దాసరి సదానందంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఈత చెట్టు పైనుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**తొలి అక్షరం/మంథని,13:** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బోయినపేట పరిసరాల్లో ఆదివారం ఈత చెట్టు పైనుండి పడి గీతా కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి.గంగాపూర్ కి చెందిన తాటి శంకర్ గౌడ్ (55) ఈత కల్లు తీస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ఆయనకుతీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ దవాఖానా కు తరలించారు.

## కొత్త రాజిరెడ్డి మృతి టిడిపికి తీరని లోటు..!





**తొలి అక్షరం/గోదావరిఖని,13:** రామగుండం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మొట్టమొదట తెలుగుదేశం స్థాపనలో నందమూరి తారక రామారావు వెంట మొట్టమొదటిగా రామగుండం నియోజకవర్గంలో స్థాపన అధ్యక్షుడుగాను అదేవిధంగా మూడు నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ స్థాపికుడు కొత్త రాజిరెడ్డి ఈరోజు ఉదయం మరణించడం జరిగింది.రామగుండం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పక్షాన ఘనంగా నివాళు లర్పించడం జరిగింది వారి భౌతిక గాయంపై తెలుగుదేశం పార్టీ జెండా కప్పి ఆత్మ శాంతించాలని నివాళులర్పించారు. అదేవిధంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో రామగుండం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కే నిమ్మకాయలు ఏడుకొండలు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎక్స్ కార్యదర్శి, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ముదిగంటి దామోదర్ రెడ్డి టిఎన్టియుసి పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు, గుండబోయిన ఓదెలు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, పెగడపల్లి రాజనర్సు, సుందిళ్ల స్వామి తదితరులు పాల్గోన్నారు.

## విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలి : సీపీ..



**తొలి అక్షరం/రామగుండం,13** విజయదశమి పండుగ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిది పెద్దపల్లి మంచిర్యాల్ జోన్ ల ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని, రామగుండం పోలీస్ కమిషనరేట్ అన్ని రంగాలలో అగ్రభాగంలో ఉండాలని కోరుతూ రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస ఐ పి ఎస్ ఆకాంక్షించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో పోలీస్ కమీషనర్ ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుందని అలాంటి విజయాలను చేకూర్చే విజయదశమి పర్వదినోత్సవం అందరికి సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖలో ప్రతి స్థాయిలోని అధికారి ప్రజా రక్షణలో ముందుంటూ మన్ననలు అందుకుంటూ పోలీస్ శాఖ గౌరవం మరింత పెరిగేలా పని చేయాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకుంటారని అన్నారు. సమాజంలో చెడును పారద్రోలేందుకు పోలీసు విభాగం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వాహనాల పూజ నిర్వహించి అందరికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.పూజా కార్యక్రమాలలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ఐపిఎస్., అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏ ఆర్ ఏ సి పి ప్రతాప్, సుందర్ రావు, ఆర్ ఐ లు దామోదర్, మల్లేశం, వామన మూర్తి, సంపత్, శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, ఎస్ఐ, ఆర్ఎస్ఐ లు, డ్రైవర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంఎల్ఏ...



**తొలి అక్షరం/గోదావరిఖని,13** ఈరోజు స్థానిక 6వ డివిజన్లో అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యా లయాన్ని ప్రారంభించిన రామ గుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పథకాలు, సంక్షేమ కార్యక్ర మాలు ప్రజలందరికీ అందు బాటులో సమాచారం ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ 6 గ్యారంటీలలో మహిళలకు బస్సు ఫ్రీ,500 రూపాయలకే గ్యాస్, రైతు రుణమాఫీ, 10లక్షల వరకు ఆరోగ్యశ్రీ సేవలు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు వంటి అనేక సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.


## కార్మిక సమస్యలపై పట్టింపు లేక ఒక స్ట్రక్చర్ సమావేశాన్ని కోల్పోయిన గుర్తింపు సంఘం సీఐటీయు....





**తొలి అక్షరం/గోదావరిఖని,13:** యాజమాన్యం నిర్వహించిన ఎన్నికలలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచి నేటికీ 9 నెలలు గడిచినా సీఐటీయు చేసిన పోరాటం మేరకు యాజమాన్యం రెండు సంవత్సరాలకే గుర్తింపు పత్రం ఇచ్చి ప్రతి నెల రెండవ మంగళవారం ఏరియా లెవెల్ లో స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పి సర్క్యులర్ ఇచ్చినా గెలిచిన సంఘం స్ట్రక్చరల్ సమావేశాలలో మాట్లాడాల్సిన కార్మిక సమస్యలపై పట్టింపు లేకుండా యాజమాన్యం నిర్వహిస్తున్న బడా ఖానాను వ్యతిరేకిస్తున్నామంటూనే కార్యక్రమాల్లో వేదికలపై ఉంటున్న తీరు సరైనది కాదని ఇప్పటికే లాభాల వాటా విషయంలో గుర్తింపు సంఘంగా విఫలమయ్యారని ఇప్పటికైనా మీకున్న రెండు సంవత్సరాల కాలంలో ఒక స్ట్రక్చర్ మీటింగ్ ను కోల్పోయారని వెంటనే యాజమాన్యంకు కార్మిక సమస్యలైన మంచినీటి సమస్య తీర్చేందుకు గ్రాటివిటీ ఫిల్టర్ బెడ్డు యుద్ధ ప్రతిపాదికన నిర్మాణం పూర్తి చేసి త్రాగునీరు అందించాలని. CSP-1 బొగ్గు దుమ్ము ధూళితో చుట్టుపక్కల ప్రజలతోపాటు కార్మికులు అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నారని వెంటనే బొగ్గు దుమ్ము ధూళి నివారణ చర్యలు చేపట్టాలని. గనులకు వెళ్లే రహదారిని బాగు చేయించాలని వీధిలైట్లు ఏర్పాటు చేయాలని. క్వార్టర్ లేని కార్మికులకు రామగుండం కార్పొరేషన్ ఇంటికిరాయి చెల్లించాలని. సింగరేణి ఏరియా హాస్పిటల్ ను ఆధునికరించి అన్ని వ్యాధులకు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని. డిస్పెన్సరీలో పూర్తిస్థాయి వైద్యులతో పాటు రక్త పరీక్షలు నిర్వహించడానికి పాతాలజిస్టును నియమించి ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేయాలని, ఏరియాలోని అన్ని గనులపై కార్మికుల వస్తువులు భద్రపరుచుట కొరకు సేఫ్టీ లాకర్ల ఏర్పాటు చేయాలని. క్లర్కుల కొరకు ఆఫీసులలో కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని. క్వార్టర్లలో ఉంటున్న ఇతరులను ఖాళీ చేయించాలని. కార్మిక కాలనీలలోని రోడ్లు బాగు చేయించి డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో రిపేర్లు చేయించాలని. సర్ఫేస్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ చలికాలంకు ముందే గరం కోట్లు ఇప్పించాలని. కార్మికుల వివరాలన్నీ ఆన్లైన్ చేసిన మేరకు రిఫరల్ కొరకు గనిపై సంతకాల సేకరణ చేయడం ఆపివేయాలని, గత నెల నుండే జనరల్ మజ్దూర్ ఇస్తున్నామనే మేరకు వెంటనే జనరల్ మద్దూర్లు లెటర్లు ఇవ్వాలని. కార్మికులపై పని ఒత్తిడి తగ్గించేలా చూడాలని కోరుతూ ముందుగానే నోటీసు ఇచ్చి ఈ నెలలో నైన స్ట్రక్చర్ మీటింగ్లు ఏర్పాటు చేసి ఏరియా సమస్యలను పరిష్కరించాలని. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియుగా డిమాండ్ చేస్తున్నాము.

## ప్రొఫెసర్ సాయిబాబాకు కన్నీటి వీడ్కోలు...




**తొలి అక్షరం/పెద్దపల్లి,13:** ప్రొఫెసర్ సాయిబాబా శాస్త్ర చికిత్స కోసం హైదరాబాదులో నిమ్స్ హాస్పటల్లో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం దేశానికి,పౌరులకు, ఆదివాసులకు, దళితులకు, మైనారిటీలకు,పేద వర్గాలకు, కార్మిక వర్గానికి తీరని నష్టమని, ఆయన బ్రతికి తీవ్ర ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబా అట్టడుగు పేద వర్గాలలో జన్మించి, 90 శాతం వికలాంగులుగా ఉండి కూడా ఉన్నత విద్యను అభ్యసించి ప్రొఫెసర్ స్థాయికి అభివృద్ధి చెందాడని, మార్క్సిస్టు దృక్పథం కలిగి ఉండి, పాలకవర్గాల దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాటాలు నిర్వహించారని, ముఖ్యంగా పౌర హక్కుల కోసం ఆదివాసులు, దళితుల హక్కుల కోసం ధైర్యంగా నిలబడి పోరాటాలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. ఫాసిస్టు మోడీ బి జె పి ప్రభుత్వం సాయిబాబాను అర్బన్ నక్షలైట్, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని అక్రమంగా అరెస్టు చేసే 8 సంవత్సరాలు నాగపూర్ అండర్ సెల్లో పండించే కనీస వైద్య సౌకర్యాలు కూడా అందించకపోవడం వలన ఆయన ఆరోగ్యం క్షీణించి, చివరి దశలో బెయిల్ వచ్చి విడుదలైనారనీ, అనారోగ్యంగా ఉంది వైద్యం చేయించుకోవడానికి నిమ్స్ హాస్పిటల్ లో అడ్మిట్ అయి చేస్తా చికిత్స చేసిన అనంతరం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం దేశానికి, దేశ ప్రజలకు అన్ని వర్గాలకు తీరనిలోటు అని ఆయన అన్నారు. సాయిబాబా మంచి విశ్లేషకుడు, రచయిత, కవి, ఉపన్యాసకులు, స్నేహశీలి, ఆంగ్ల విద్యలో మంచి ప్రావీణ్యం కలిగిన వాడు అని ఆయనన్నారు. సాయిబాబా తల్లి తను జైల్లో ఉన్నప్పుడే క్యాన్సర్ వ్యాధితో మరణించారని తనకు భార్య వసంత,కూతురు ఉన్నారని వారికి ప్రకార సానుభూతిని సంతాపాన్ని తెలుపుతున్నామనీ ఆయన అన్నారు. సాయిబాబా మృతి తీరనిలోటు అని ఆయనన్నారు.

# ముంబై ఇండియన్స్‌కు కొత్త కోచ్.. టీ20 వరల్డ్ కప్ విజేత వచ్చేశాడు!



ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ సిబ్బందిలో భారీ మార్పులు చేసింది. కొత్త ప్రధాన కోచ్‌తో పాటు బౌలింగ్ కోచ్‌ను నియమించింది. 2017 నుంచి 2022 వరకు పనిచేసిన మాజీ కోచ్ మహేలా జయవర్ధనెకు తిరిగి హెడ్ కోచ్‌గా బాధ్యతలు అందించింది.మార్క్ బౌచర్ స్థానంలో జయవర్ధనెను నియమిస్తున్నట్లు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.47 ఏళ్ల శ్రీలంక మాజీ కెప్టెన్ మహేలా జయవర్ధనె 2022 నుంచి కూడా ముంబై ఫ్రాంచైజీలోనే కొనసాగాడు. గ్లోబల్ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా ముంబై ఫ్యామిలీలోనే ఉన్నాడు. ముంబై ఇండియన్స్ న్యూయార్క్ లీగ్, ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ తరఫున, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ముంబైకు కోచింగ్ స్టాఫ్‌గా టైటిళ్లు అందించాడు. కాగా, కోచ్‌గా మార్క్ బౌచర్ హయాంలో ముంబై జట్టులో భారీ మార్పులు సంభవించాయి.రోహిత్ శర్మకు బదులుగా హార్దిక్ పాండ్యను కెప్టెన్‌గా నియమించారు. అయితే గత సీజన్‌లో ఈ నిర్ణయం జట్టు ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపించింది. పాయింట్ల పట్టికలో ముంబై అట్టడుగన నిలిచింది. మరో రెండు వారాల్లో రిటైన్ లిస్ట్‌ను ప్రకటించినున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ యాజమాన్యం కోచింగ్ బాధ్యతలు జయవర్ధనెకు తిరిగి అప్పగించడం గమనార్హం. కాగా, ముంబై ఫ్యామిలీలో మార్క్ బౌచర్ సభ్యుడిగా కొనసాగుతాడని ముంబై ఇండియన్స్ పేర్కొంది.

# పాక్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం..

## - ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు బాబర్ అజామ్‌పై వేటు..!



ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో 556 పరుగుల భారీ స్కోర్ సాధించి కూడా ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలైన పాకిస్థాన్ రెండో టెస్టుకు సిద్ధమవుతోంది.మంగళవారం నుంచి ముల్తాన్ వేదికగానే రెండో టెస్టు ప్రారంభం కానుంది. అయితే ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పరువు కాపాడుకోవాలని పాకిస్థాన్ భావిస్తోంది. అందుకే జట్టు కూర్పు విషయంలో సెలక్షన్ కమిటీ చాలా సీరియస్‌గా ఉంది.ఈ క్రమంలో పాక్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్‌ను జట్టు నుంచి తప్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తొలి టెస్టు ఓటమి అనంతరం పాకిస్థాన్ టెస్టు కెప్టెన్ షాన్ మసూద్, కోచ్ గిలెస్పీ బాబర్ అజామ్‌కు మద్దతు ఇచ్చారు. కానీ సెలక్షన్ కమిటీలో మిగిలిన సభ్యులు బాబర్ అజామ్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలీందార్, ఆఖిబ్ జావెద్, అజర్ అలీలు బాబర్‌ను తప్పించాలని సిఫార్సు చేసినట్లు తెలిసింది.2022 డిసెంబర్ తర్వాత నుంచి బాబర్ అజామ్ టెస్టుల్లో కనీసం హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. ముల్తాన్ వేదికగా జరిగిన ఫ్లాట్ పిచ్‌పై కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 35 పరుగులే చేశాడు. 2022 నుంచి 10 టెస్టులు ఆడిన బాబర్ 27.73 సగటుతో 527 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా 55 టెస్టుల్లో 43.92 సగటుతో 3997 పరుగులు చేశాడు. కాగా, బాబర్ అజామ్ ఇటీవల పరిమిత ఓవర్ల ఫార్మాట్ కెప్టెన్సీ నుంచి కూడా తప్పుకున్నాడు.




# షాంఘై మాస్టర్స్ విజేత సిన్నర్.. ఫైనల్లో జొకోవిచ్‌పై విజయం

షాంఘై మాస్టర్స్ టైటిల్ విజేతగా జానిక్ సిన్నర్ నిలిచాడు. ఆదివారం (అక్టోబర్ 13) జరిగిన షాంఘై మాస్టర్స్‌లో నొవాక్ జొకోవిచ్‌ను 7-6 (4), 6-3 తేడాతో వరుస సెట్లలో ఓడించాడు.ప్రస్తుతం నెంబర్ 1 ర్యాంక్ లో కొనసాగుతున్న సిన్నర్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, యూ ఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్స్ టైటిల్ గెలుచుకున్న సంగతి తెలిసిందే.మరోవైపు కెరీర్ లో 100 వ టైటిల్ గెలవాలని ఆశించిన 24 సార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్ కు నిరాశే ఎదురైంది. ఇప్పటివరకు టెన్నిస్ లో జిమ్మీ కానర్స్ 109 టైటిల్స్ తో ప్రథమ స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ 103 టైటిల్స్ తో రెండో స్థానంలో నిలిచాడు.తొలి సెట్ లో సిన్నర్ కు గట్టి పోటీ ఇచ్చినా రెండో సెట్ లో తేలిపోయాడు. ఈ ఏడాది సిన్నర్ చేతిలో ఓడిపోవడం జొకోవిచ్ కు ఇది మూడో సారి కావడం విశేషం. ఈ మ్యాచ్ లో సిన్నర్ మొత్తం ఎనిమిది ఏస్‌లు, 22 విన్నర్లు కొట్టాడు. మరోవైపు జొకోవిచ్ నాలుగు ఏస్‌లు, 12 విన్నర్లు కొట్టాడు. జొకోవిచ్ కు సిన్నర్ ఒక్క బ్రేక్ పాయింట్ ఛాన్స్ కూడా ఇవ్వలేదు.



# సంజు గురించి గంభీర్ ఆనాడే చెప్పాడు: ఆకాశ్ చోప్రా

ఇంటర్నెట్ డెస్క్: ఉప్పల్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా రికార్డు విజయాన్ని సాధించింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.భారత బ్యాటర్ల విజృంభణ, మరీ ముఖ్యంగా సంజు శాంసన్ వీరోచిత ఇన్నింగ్స్(111, 47 బంతుల్లో)తో భారత్ 297 పరుగుల స్కోర్ చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లా, భారత బౌలర్ల దూకుడు ప్రదర్శనతో 164 పరుగులకే కుప్పకూలింది. ఈ నేపథ్యంలో సంజు నాక్ గురించి భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా మాట్లాడాడు. అతడు గొప్ప బ్యాటర్ అని నాలుగేళ్ల క్రితం భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ చేసిన ట్వీట్‌ను క్రికెట్ అభిమానులకు గుర్తు చేశాడు.'సంజు ఇన్నింగ్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. తన అద్భుత ప్రదర్శనతో అభిమానులను అబ్బుర పరిచాడు. సంజు 'ఒక గొప్ప వికెట్ కీపర్ మాత్రమే కాదు.. గొప్ప బ్యాటర్ కూడా' అని గంభీర్ నాలుగేళ్ల క్రితం సంజుని ఉద్దేశించి ట్వీట్ చేశాడు. అయితే నీ కెరీర్‌కి గౌతీ ట్వీట్‌నే స్ఫూర్తిగా తీసుకుని మంచి ప్రదర్శనలు ఇస్తూ ఉండు అని నేను సంజుని ఇంటర్వ్యూ చేసినప్పుడు చెప్పాను.సంజుకి గంభీర్ పెద్ద అభిమాని. ఇప్పుడు అతడికి బ్యాటింగ్‌కి మరోసారి ఫిదా అయి ఉంటాడు. గంభీర్ తన ట్వీట్‌ని సంజు నిజం చేయాలనే ఉద్దేశంతోనే ఇన్ని రోజులు ఎదురుచూశాడు. లెగ్ స్పిన్నర్ రిషద్ వేసిన పదో ఓవర్లో ఐదు సిక్స్‌ల ప్రదర్శన చూడటానికి రెండు కళ్లు సరిపోలేదు. కెరీర్‌లో వరుస వైఫల్యాలను ఎదుర్కొంటున్నప్పటికీ భారత జట్టు మేనేజ్‌మెంట్ సంజుకి మద్దతుగా నిలిచింది. కెప్టెన్, కోచ్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని శాంసన్ వృథా చేయలేదు. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, శుభ్‌మన్ గిల్ ఓపెనింగ్ స్థానం కోసం పోటీ పడుతున్న ఈ నేపథ్యంలో సంజు సెంచరీ చేయడం సానుకూల అంశం' అని సంజుని ప్రశంసించాడు ఆకాశ్. ఇదిలా ఉండగా, 47 బంతుల్లో 111 పరుగులు చేసి టీ20 క్రికెట్‌లో సెంచరీ సాధించిన తొలి వికెట్ కీపర్-బ్యాటర్‌గా నిలిచాడు శాంసన్. టీ20ల్లో మొదటి సెంచరీ సాధించిన అతడు.. రోహిత్‌శర్మ తర్వాత వేగవంతమైన (40 బంతుల్లో) శతకం చేసిన భారత బ్యాటర్‌గా ఘనతను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

# టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్ ఔట్

మహిళల టీ20 ప్రపంచకప్-2024 నుంచి మరో జట్టు నిష్క్రమించింది. గ్రూప్-బి నుంచి బంగ్లాదేశ్ జట్టు ఎలిమినేట్ అయ్యింది. నిన్న సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఓడటంతో బంగ్లాదేశ్ ఇంటిబాట పట్టింది.ఈ గ్రూప్ నుంచి స్కాట్లాండ్ ఇదివరకే ఎలిమినేట్ అయ్యింది.సౌతాఫ్రికా, బంగ్లాదేశ్ మ్యాచ్ విషయానికొస్తే.. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. శోభన మోస్తరి (38), నిగార్ సుల్తానా (32 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో మారిజన్ కాప్, డెర్క్‌సెన్, మ్లాబా తలో వికెట్ పడగొట్టారు.అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సౌతాఫ్రికా.. తంజిమ్ బ్రిట్స్ (42) రాణించడంతో 17.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. అన్నెకె బోష్ (25) ఓ మోస్తరు పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహిమా ఖాతూన్ రెండు వికెట్లు పడగొట్టగా.. రితే మోనీ ఓ వికెట్ దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో గెలుపుతో సౌతాఫ్రికా అగ్రస్థానానికి (గ్రూప్-బి పాయింట్ల పట్టికలో) చేరుకుంది. వెస్టిండీస్, ఇంగ్లండ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.



# సెంచరీ చేజార్చుకున్న రుతురాజ్

రంజీ ట్రోఫీ 2024లో భాగంగా జమ్మూ అండ్ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మహారాష్ట్ర కెప్టెన్, టీమిండియా ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు.ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో రుతు 86 పరుగులు చేసి ఔటయ్యాడు. ఓ పక్క రుతురాజ్ సెంచరీ చేజార్చుకోగా సహచరుడు సిద్దేశ్ వీర్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.మూడో రోజు టీ విరామం సమయానికి మహారాష్ట్ర స్కోర్ 3 వికెట్ల నష్టానికి 221 పరుగులుగా ఉంది. సిద్దేశ్ వీర్ (100), అంకిత్ బావ్నే (9) క్రీజ్‌లో ఉన్నారు. మహారాష్ట్ర ఇన్నింగ్స్‌లో ముర్తజా ట్రంక్‌వాలా (0), సచిన్ దాస్ (10) నిరాశపరిచారు. జమ్మూ అండ్ కశ్మీర్ బౌలర్లలో రసిక్ దార్ సలామ్ రెండు వికెట్లు పడగొట్టగా.. యుద్ధ్‌వీర్ సింగ్ చరక్ ఓ వికెట్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం మహారాష్ట్ర జమ్మూ అండ్ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్ స్కోర్ కంటే 298 పరుగులు వెనుకపడి ఉంది.అంతకుముందు జమ్మూ అండ్ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 519 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. శుభమ్ ఖజూరియా డబుల్ సెంచరీతో (255), శివాంశ్ శర్మ (106 నాటౌట్) అజేయ సెంచరీతో విజృంభించారు. వీరిద్దరు మినహా జమ్మూ అండ్ కశ్మీర్ ఇన్నింగ్స్‌లో ఎవ్వరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. శుభమ్ పుండిర్ 37, డోగ్రా 30, ఆబిద్ ముస్తాక్ 29 (నాటౌట్) పరుగులు చేశారు. మహారాష్ట్ర బౌలర్లలో హితేశ్ వలుంజ్ 4 వికెట్లు పడగొట్టగా.. అర్షిన్ కులకర్ణి, ముకేశ్ చౌదరీ, రజినీష్ గుర్బానీ తలో వికెట్ దక్కించుకున్నారు.



# బంగ్లా సిరీస్‌పై గంభీర్ ఏకవాక్య ఎక్స్ పోస్టు

ఇంటర్నెట్‌డెస్క్: బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌పై టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ ఏకవాక్య ఎక్స్ పోస్టు పెట్టాడు. టెస్టు, టీ 20 ఫార్మాట్లలో టీమ్ ఇండియా ఏకపక్షంగా విజయం సాధించిన విషయం తెలిసిందే.దీనిపై గౌతీ ఎక్స్ వేదికగా 'ఏ టూర్ డె ఫోర్స్!' అని ట్రోఫీ స్వీకరణ ఫొటోను పోస్టు చేశాడు. అద్భుతమైన ప్రతిభతో ఏదైనా లక్ష్యాన్ని ఇలా అభివర్ణిస్తారు.ఈ టోర్నీలో మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలిచిన ఆల్‌రౌండర్ పాండ్యా కూడా కోచ్, కెప్టెన్ పాత్రను ప్రశంసించాడు. వారు తనకు మైదానంలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని పేర్కొన్నారు. టీ20 ఫార్మాట్‌లో భారత్ వరుసగా రెండో క్లీన్‌స్వీప్ చేసింది. గౌతమ్ గంభీర్ - సూర్యకుమార్ కాంబినేషన్‌లో ఇది రెండోది కావడం గమనార్హం. ఇటీవల శ్రీలంకను అక్కడి మైదానాల్లోనే 3-0తో భారత్ ఓడించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బంగ్లాను కూడా చిత్తు చేసేసింది. అయితే, ఈ జోడీకి ముమ్ముందు కఠిన సవాల్ ఎదురుకానుంది. దక్షిణాఫ్రికాతో వచ్చే నెల తొలి వారం నుంచి ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. అంతకుముందు అక్టోబర్ 16 నుంచి న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్ ఆడనుంది.





# శ్రద్ధాకపూర్ ప్రేమలో పడ్డారా..? వైరల్‌గా మారిన నటి రీసెంట్ కామెంట్స్

ఇంటర్నెట్‌డెస్క్: 'స్త్రీ 2'తో ఇటీవల విజయాన్ని అందుకున్నారు బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్. ఈ ఆనందంలోనే ఆమె వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు.తాజాగా ఓ ఆంగ్ల మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "భాగస్వామితో విలువైన సమయాన్ని గడిపేందుకు నేను ఇష్టపడతా. అతనితో కలిసి సినిమాలు చూడటం, డిన్నర్‌కి వెళ్లడం, ప్రయాణం చేయడం వంటి పనులు నాకెంతో ఇష్టం. పెళ్లి చేసుకున్నామా? లేదా? అనే దాని కంటే.. సరైన వ్యక్తితో జీవితాన్ని కొనసాగిస్తున్నామా? లేదా అనేది ఎంతో ముఖ్యం" అని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.బాలీవుడ్ సినీ రచయిత రాహుల్‌తో శ్రద్ధాకపూర్ రిలేషన్‌లో ఉందంటూ ఎంతోకాలం నుంచి వార్తలు వస్తున్నాయి. ఆయా కథనాలకు మరింత బలం ఇచ్చేలా వీరిద్దరూ కలిసి పలు పార్టీలకు హాజరైన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల ఇన్‌స్టాలో రాహుల్‌ను అన్‌ఫాలో చేశారు శ్రద్ధాకపూర్. దీంతో ఈ జంట విడిపోయిందని పలువురు భావించారు. ఈ క్రమంలోనే శ్రద్ధాకపూర్ చేసిన తాజా వ్యాఖ్యలు సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించాయి. ఆమె చెబుతుంది రాహుల్ గురించేనని కొంతమంది.. కాదు వేరే వ్యక్తి గురించి అని కొంతమంది అనుకుంటున్నారు.'స్త్రీ 2' విషయానికి వస్తే.. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధాకపూర్ జంటగా నటించిన చిత్రమిది. 2018లో వచ్చిన 'స్త్రీ' చిత్రానికి సీక్వెల్‌గా ఇది తెరకెక్కింది. అమర్ కౌశిక్ దర్శకుడు. ఆగస్టు 15న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. దాదాపు రూ.800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం ఇది అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులో ఉంది.

# తగ్గితే తప్పేంటంటున్న బుట్టబొమ్మ..! ఇంకా పూజ కష్టాలు తీరలేదా..?



ఆ మధ్య సౌత్ నార్త్ ఇండస్ట్రీల్లో సూపర్ ఫామ్‌లో కనిపించిన పూజా హెగ్డే సడన్‌గా స్లో అయ్యారు. అవకాశాలు తగ్గిపోవటం, వచ్చిన అవకాశాలు కూడా చేజారిపోవటంతో అమ్మడి కెరీర్ కష్టాల్లో పడింది.మళ్లీ ఇప్పుడిప్పుడే తిరిగి ఫామ్‌లోకి వస్తున్న ఈ బ్యూటీ, అప్ కమింగ్ ల విషయంలో బిగ్ డెసిషన్ తీసుకున్నారు. ఈ నిర్ణయం అమ్మడికి అవకాశాలు తెచ్చిపెడుతోంది.రాధేశ్యామ్ రిలీజ్‌కు ముందు కెరీర్‌లో మంచి ఫామ్‌లో ఉన్నారు పూజా హెగ్డే. కానీ ఆ ఫెయిల్యూర్ అరవింద ఆశలు ఆవిరి చేసేసింది.రాధేశ్యామ్ సూపర్ హిట్ అయితే పాన్ ఇండియా హీరోయిన్‌గా బిజీ అవ్వొచ్చని భావించిన బుట్టబొమ్మకు షాక్ తగిలింది. భారీ ఆశలు పెట్టుకున్న భాయ్ మూవీ కూడా బాక్సాఫీస్ దగ్గర దారుణంగా ఫెయిల్ అయ్యింది.దీంతో నార్త్‌లోనూ పూజ కెరీర్‌కు బ్రేకులు పడ్డాయి. కెరీర్ కష్టాల్లో ఉన్న టైమ్‌లో నార్త్‌లో దేవా అవకాశం రావటంతో ఊపిరి పీల్చుకున్నారు బుట్టబొమ్మ. తాజాగా సౌత్‌లో కూడా క్రేజీ ఆఫర్స్ పూజ హెగ్డే కిట్టీలో చేరుతున్నాయి.సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ రూపొందిస్తున్న లో పూజానే హీరోయిన్‌గా ఫిక్స్ చేసింది యూనిట్. దళపతి విజయ్ చివరి లోనూ ఈ బ్యూటీనే హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యింది. వరుస అవకాశాలతో పూజ బిజీ అవ్వటం వెనుక బిగ్ స్ట్రాటజీ ఉందన్న టాక్ వినిపిస్తోంది.గతంలో భారీ పారితోషికం అందుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు కమిట్ అవుతున్న ల పేమెంట్ విషయంలో మాత్రం చూసీ చూడనట్టుగా ఉంటున్నారట. అందుకే పూజను హీరోయిన్‌గా తీసుకునేందుకు ఇంట్రస్ట్ చూపిస్తున్నారు మేకర్స్.

# విదేశీ అమ్మాయిని.. హిందీ రాదనుకున్నారు!



బాలీవుడ్ బ్యూటీ అదా శర్మ తొలిసారి కెమెరా ముందు నటించిన చిత్రం 1920. ఈ హారర్ చిత్రంతోనే ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ మూవీ చిత్రీకరణ సమయంలో చాలామంది తనను చూసి విదేశీ నటి అనుకున్నారట! తాజాగా ఈ విషయాన్ని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. '1920 సినిమా షూటింగ్ ఎక్కువ భాగం లండన్‌లోనే జరిగింది.విదేశీ అమ్మాయి అనుకున్నారు అక్కడ ఎండ అనేదే లేదు. దానికి తోడు విపరీతమైన చలి. అప్పుడు నేను బ్లూ లెన్స్ పెట్టుకున్నాను. నన్నలా చూసి చాలామంది నేను విదేశీ అమ్మాయి అనుకున్నారు. నాకసలు హిందీయే రాదని అభిప్రాయపడ్డారు. చాలాకాలం అదే భ్రమలో ఉండిపోయారు. కానీ నేను భారతీయురాలినే, నాకు హిందీ వచ్చు అని ఏనాడూ క్లారిటీ ఇవ్వాలనిపించలేదు.సోషల్ మీడియ్లా తెలీదుపైగా అప్పట్లో సోషల్ మీడియా అంటేనే అంతగా తెలియదు. ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా లేను' అని చెప్పుకొచ్చింది. ఇకపోతే అదా నటించిన రీటా సాన్యల్ వెబ్ సిరీస్ హాట్‌స్టార్‌లో అక్టోబర్ 14 నుంచి ప్రసారం కానుంది.

# నచ్చితే చేయండి.. లేకపోతే లేదు: అనన్య నాగళ్ల అసహనం

**ఇంటర్నెట్‌డెస్క్:** తాను షేర్ చేసిన ఓ వీడియోకు వస్తోన్న విమర్శలపై నటి అనన్య నాగళ్ల స్పందించారు. ఎందుకింత నెగటివిటీ అంటూ తన అసహనాన్ని వ్యక్తంచేశారు."ప్లాస్టిక్ వాడకం తగ్గించమని ఇటీవల నేనొక వీడియో షేర్ చేశా. దాన్ని కొందరు తప్పుబట్టారు. విమర్శలు చేశారు. చిన్న విషయం చెప్పా. నచ్చితే చేయండి.. లేకపోతే లేదు. ఎందుకింత నెగటివిటీ?" అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్‌గా మారింది.సోషల్‌మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే అనన్య.. ఇటీవల ఓ వీడియో షేర్ చేశారు. ఇందులో ఆమె స్ట్రా సాయం లేకుండా కొబ్బరిబొండాం నీళ్లు తాగుతూ కనిపించారు. "సాధారణంగా నేను స్టీల్ స్ట్రా వెంట తెచ్చుకుంటాను. అది లేని పక్షంలో ఈ విధంగా కొబ్బరినీళ్లు తాగుతా. ప్లాస్టిక్ వాడకాన్ని కాస్త తగ్గిద్దాం. చిన్న చిన్న పనులే పెద్ద మార్పులకు శ్రీకారం చుడతాయి" అని రాసుకొచ్చారు. దీనిని చూసిన పలువురు నెటిజన్లు ఆమె అభిప్రాయాన్ని తప్పుబట్టారు. "మీ పక్కన ఉన్న ఆవిడకు ముందు చెప్పండి. ఆమె స్ట్రాతో తాగుతున్నారు" అని కామెంట్స్ చేశారు. తెలుగు అమ్మాయి అనన్య నాగళ్ల 2019లో విడుదలైన 'మల్లేశం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తొలి చిత్రంతోనే ఆదరణ సొంతం చేసుకున్నారు. 'ప్లే బ్యాక్', 'వకీల్‌సాబ్', 'శాకుంతలం', 'మళ్ళీ పెళ్లి' వంటి చిత్రాల్లో నటించారు. ఆమె నటించిన 'పొట్టేల్' విడుదలకు సిద్ధంగా ఉంది. అక్టోబర్ 25న విడుదల కానుంది.



# 'దేవర' @ 500 కోట్లు.. మేకర్స్ పోస్ట్




**హైదరాబాద్:** ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ తెరకెక్కించిన చిత్రం 'దేవర' . ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది.16 రోజుల్లోనే ఈ సినిమా రూ.500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టింది. దీనిపై అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'దేవర'లో ఎన్టీఆర్.. వర, దేవర అనే రెండు పాత్రల్లో కనిపించారు. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్ర పోషించారు. సెప్టెంబర్ 27న విడుదలైంది. ఎన్టీఆర్ వన్ మ్యాన్ షో అని అందరూ ప్రశంసించారు. దీనికి కొనసాగింపుగా 'దేవర 2' రానున్న విషయం తెలిసిందే. సీక్వెల్‌పై ఇటీవల కొరటాల శివ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు . ఎన్టీఆర్ మాట్లాడుతూ.. మొదటి భాగం విజయం సాధించడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే పార్ట్ 2 అద్భుతంగా ఉంటుందని నటుడు శ్రీకాంత్ తెలిపారు.